కంచెల్లేని ట్రాన్స్‌ఫార్మర్లు

- ప్రమాదాల బారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- బడ్జెట్ రావడం లేదని దాటవేత

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయనే భయంతో ఆయా గ్రామస్తులు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఆత్మకూర్ పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్డంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్ల గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికీ కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడం వల్ల మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నా సంబంధిత అధికారులు నివారించే ప్రయత్నాన్ని చేపట్టడం లేదు. పలుమార్లు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


మూలమల్ల గ్రామంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదాలు నివారించాలి..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదివరకే పలుమార్లు ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపిన ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి.

–మోష, మూలమల్ల

బడ్జెట్ రావడం లేదు..



ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేని కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న విషయాన్ని ఉన్నతస్థాయి అధికారులకు గతంలోనే నివేదించాం. నిధులు రాకపోవడంతో ఆలస్యమవుతుంది. ఇదివరకు ఆత్మకూర్ పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేశారు. నిధులు విడుదల అయినవెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

–నర్సింహులు, ఏఈ ట్రాన్స్‌కో, ఆత్మకూర్


పిన్నంచర్ల గ్రామంలో..


కత్తేపల్లి గ్రామంలో..


గుంటిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన పశువు (ఫైల్)

క్లుప్తంగా

14న ఆంజనేయ ఆలయ నిర్మాణానికి శ్రీకారం



అమరచింత: పట్టణంలో పురాతన ఆంజనేయస్వామి ఆలయం శిథిలం కావడంతో నూతన ఆలయ నిర్మాణానికి ఈనెల 14న ముహూర్తం సిద్ధం చేశారు. శిథిల ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని బాలంజనేయ విగ్రహంలో ప్రాణఃప్రతిష్ట పూజలు చేపట్టి ఆలయాన్ని పొక్లెయిన్‌తో తొలగించారు. నిర్మాణం జరిగే వరకు మూలవిరాట్‌గా ఉన్న స్వామివారి విగ్రహాన్ని యథాస్థలంలోనే ఉంచి పనులు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భూమిపూజకు మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివాజితో పాటు పలువురు పాల్గొన్నారు.

పాఠశాలకు డ్రమ్స్, మైక్‌సెట్ వితరణ



పాన్‌గల్: మండలంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గోవర్ధన్‌నాయుడు డ్రమ్స్, మైక్‌సెట్, తెలుగువికాసం పుస్తకాలను సోమవారం ఎంఈఓ శ్రీనివాసులు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రూ.15వేలు విలువైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు



అమరచింత: ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తు డిప్యూటేషన్‌పై కొత్తకోట ఎంపీడీఓగా బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తిరిగి మండల ఎంపీడీఓగా విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆత్మకూర్ ఎంపీఓగా కొనసాగుతున్న శ్రీరాంరెడ్డిని అమరచింత ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. శ్రీరాంరెడ్డి ద్వారా మళ్లీ చార్జి తీసుకున్నట్లు తెలిపారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు ఎంపీడీఓ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయాలి



ఆత్మకూర్: నిరంతరం ప్రజలపక్షాన పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కార లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. సోమవారం స్థానిక అతిథిగృహంలో సీపీఐ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 19, 20, 21, 22 వతేదీల్లో మల్కాజిగిరి జిల్లాలో మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీహరి, మోష, లక్ష్మీనారాయణశెట్టి, లింగన్న, ఆంజనేయులు ఉన్నారు.

చెస్‌తో ఆలోచనా శక్తి పెంపొందుతోంది



ఖిల్లాఘనపురం: చెస్ ఆడటం వలన విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని ఎంఈఓ జయశంకర్, ఎస్‌ఆర్‌ఐ మేరెడ్డి రవిప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఆర్‌ఐ ఫోరం ఫౌండేషన్ 39 ప్రభుత్వ పాఠశాలలకు 170 చెస్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ ఆడటంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం రాజేష్‌రెడ్డికి ఎంఈఓ తోపాటుగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కాళిదాస్, మునావర్ సుల్తానా, చెన్నప్ప పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను సన్మానిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి : చదువు పై శ్రద్ధ చూపుతూనే క్రీడా రంగంలోనూ రాణించేందుకు విద్యార్థులు ప్రయతి్నంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 3,4వ, తేదీల్లో జరిగిన 11వ, రాష్ట్రస్థాయి జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ ఛాపింయన్ షిప్ పోటీలో పాల్గొని మెడల్స్ సాధించిన క్రీడాకారులను సోమవారం కలెక్టర్ ఆయన ఛాంబర్‌లో సన్మానించారు. కేశవగా లావణ్య, హై జంప్‌లో గోల్డ్ మెడల్, బద్దు నాయక్, 5000 మీటర్స్ రేస్ వాక్, జంగం సాయి సాత్విక్ 60 మీటర్స్, టి. సుచిత్ర స్టాండింగ్ బ్రాడ్ జంప్ సురేష్ నాయక్ కిడ్స్ జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్స్, శంకర్‌నాయక్ జావెలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్, పీఈటీలు ఆంజనేయులు, నవీన్ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

వనపర్తిటౌన్: నిబంధనల ప్రకారం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు మాంసం వ్యర్థాలు ఇవ్వకపోతే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చికెన్ వేస్టేజ్ టెండర్‌దారుడు జిల్లా కేంద్రంలో పలు చికెన్‌సెంటర్ల నిర్వాహకులు తమకు వ్యర్థాలు ఇవ్వడం లేదని, మాపై దాడి చేసేందుకు ప్రయతి్నస్తున్నారని, మేం టెండర్ పాడిన ప్రయోజనం లేదని సోమవారం పుర కార్యాలయంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌తో వాపోయారు. దీంతో స్పందించిన అధికారి సన, రైతుభారత్ చికెన్‌సెంటర్ల నిర్వాహకులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నిబంధనలను పాటించకపోతే నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మున్సిపాలిటీ జవాన్లకు క్షేత్రస్థాయిలో వెళ్లి సమాచారం అందించాలని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని సూచించాలని చెప్పారు.


ఫోన్‌లో హెచ్చరిస్తున్న అధికారులు

రైతుబీమాకు దరఖాస్తులు అందజేత


పాన్‌గల్‌లో దరఖాస్తు తీసుకుంటున్న ఏఈఓలు


అమరచింతలో..

పాన్‌గల్ : జూన్ 5వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు, ఇంతవరకు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని ఏడీఏ తిప్పేస్వామి అన్నారు. కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు జతచేసి ఏఈఓలకు అందజేయాలన్నారు. దరఖాస్తులను అందజేసేందుకు ఈనెల 13వ తేదీ వరకు గడవు ఉన్నట్లు ఏడీఏ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఏఈఓలకు దరఖాస్తులను అందజేశారు.

వీపనగండ్ల: రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పంటలకు తగు సూచనలు, సలహాలు ఇస్తుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు రైతు వేదికలో రైతులు పాల్గొని ఆయన కోరారు. మక్కపంట ప్రకృతి వ్యవసాయం అనే అంశంపై శాస్త్రవేత్తలు సూచనలు ఇస్తారని ఆయన తెలిపారు.

అమరచింత: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు రైతుబీమా పథకం కోసం ఈనెల 13 వరకు దరఖాస్తులు అందజేయాలని ఏవో అరవింద్ వెల్లడించారు. 2025 జూన్ నెల 5వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన గణపయ్యల విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఎస్సై నరేందర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులు, అఖిలపక్షం పార్టీల నాయకులతో మాట్లాడారు. ప్లాస్టర్‌ఆఫ్‌పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో నదులు, చెరువుల్లోని నీరు కలుశితం అవుతాయన్నారు.

డీజే వాడితే చర్యలు..

గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్ పూర్తిగా నిషేధించామని, ధిక్కరించేవారిపై సెక్షన్ 15 కింద కేసులు నమోదుచేసి జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానను విధిస్తామని స్పష్టం చేసారు.

నేడు శాంతి సమావేశం


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై నరేందర్

అమరచింత: గణేష్ పండుగలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు కాకుండా ముందస్తుగా శాంతి సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ హిమబిందు తెలిపారు. అన్ని గ్రామాల మండపాల నిర్వాహకులు ఉదయం 10 గంటలకు విధిగా హాజరుకావాలని కోరారు.

యూరియా కోసం రైతుల బారులు


పాన్‌గల్ విండో కార్యాలయం ఎదుట రైతుల పడిగాపులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయానికి యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న వివిధగ్రామాల రైతులు సోమవారం పెద్దసంఖ్యలో కార్యాలయానికి చేరుకున్నారు. వచ్చిన రైతులు బయోమెట్రిక్ విధానంతో యూరియా టోకెన్లను అందజేస్తుండటంతో వేలిముద్ర వేసేందుకు కార్యాలయంలో పెద్దసంఖ్యలో గుమికూడారు. యూరియా ఎకరాకు కేవలం రెండుబస్తాల చొప్పున నిబంధనతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చిన 497 బస్తాల యూరియా వచ్చిన టోకెన్లు పొందిన రైతులందరికీ పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

యూరియా సరఫరాలో ఇబ్బందులు పెట్టొద్దు

ఆత్మకూర్: వర్షకాల పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ దామోదర్, తహసీల్దార్ చాంద్ పాషా, ఏఓ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి రైతులతో మాట్లాడుతూ.. అగ్రో, హాకా రైతుసేవాకేంద్రం, ఆత్మకూర్ పీఏసీఎస్ రేచింతలలో యూరియా సిద్ధంగా ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికధరలకు అమ్మితే చర్యలు

అమరచింత: యూరియాను అధిక ధరలకు అమ్మితే ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకుంటామని ఏడీఓ దామోదర్ ఫర్టిలైజర్ షాపుల యజమానులను హెచ్చరించారు. మండలకేంద్రంలోని అగ్రో రైతు సేవా కేంద్రంను సందర్శించి యూరియా స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వ ధర కంటే అదనంగా రూ.50 తేడాతో అమ్ముతున్నారనే సమాచారం రైతుల ద్వారా వచ్చిందన్నారు. దీంతో మండలంలోని అన్ని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో స్వర్ణం

కొత్తకోట: మహబూబ్‌నగర్ జిల్లాలోని రోజ్ గార్డెన్‌లో నాల్గో జాతీయస్థాయి కరాటే పోటీలను నిర్వహించడం జరిగిందని కరాటే మాస్టర్ అబ్దుల్‌నబీ తెలిపారు. ఈ పోటీల్లో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోకాన్ కరాటే అకాడమికి చెందిన విద్యార్థిని పాల్గొని ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించిందని తెలిపారు. కటాస్ అంగర్ 6 విభాగంలో రుక్కయ్య, అండర్–10 బాలికల విభాగంలో మధిహాక్హై కళ, అండర్ 10 బాలుర విభాగంలో పవన్‌కుమార్, కుమితే అండర్ 10 విభాగంలో భరత్, కార్తికేయయాదవ్, సిద్దులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అదేవిధంగా బాలికల అండర్–12 విభాగంలో ఉమేరా బంగారు పతకం సాధించింది. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా పతకాలను అందజేసి అభినందించారు.


కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు


తరగతి గది ఎదుట నిలిచిన వర్షపునీరు

నీరు ఇలా.. వెళ్లేదెలా..?

అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. తరగతిగదిలోకి వెళ్లేదారిలో నీరు నిలిచిపోవడంతో పరిసరాలు దుర్గంధంగా తయారైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



పాన్‌గల్: అర్హులైన పేదవారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కదిరెపాడు గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి గ్రామ నాయకులతో కలిసి వారు భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామానికి చెందిన 8 మందికి ఇళ్లు మంజూరయ్యాయని, నిబంధనల మేరకు నిర్మించుకుంటే రూ.5లక్షల నిధులు విడతలుగా వారి ఖాతాల్లో జమవుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బాలరాజుయాదవ్, మాజీసర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించాలి



వనపర్తి: దొంగఓట్లను తొలగించాలని కోరుతూ.. శాంతియుత నిరసన వ్యక్తం చేసిన తమ నేత రాహుల్‌గాంధీని అరెస్టు చేశారంటూ.. సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహించారు. అనంతరం రాజీవ్‌చౌక్‌లో దిష్టిబొమ్మను దహనం చేసి తమ నాయకుడు రాహుల్‌గాంధీని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.కృష్ణ, నాయకులు సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్

కొత్తకోట: మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని, అనారోగ్యపాలైన ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని ఆయన తెలిపారు. సంవత్సరానికి రెండుజతల యూనిఫాం ఇవ్వాల్సిన అధికారులు నేటికీ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. గత ఏడు ఇవ్వాల్సిన యూనిఫాంలు టైలర్ షాప్‌లోనే మూలుగుతున్నాయని ఆయన విమర్శించారు. ప్రతినెలా కార్మికులకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం అధ్యక్షుడు కే.కృపయ్య, కే.వెంకటయ్య, కు రుమన్న, కొండన్న, పెద్దరాజు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన ఓ మహిళ ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి మల్లేశ్వరి సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన చందన (27) ఏళ్ల మహిళ, వృత్తి టైలరింగ్ ఆదివారం మధ్యాహ్నం టైలరింగ్ మెటీరియల్ కోసం ఇంటినుంచి బయటికి వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా అయాకి లభించలేదు. ఆమె తల్లి మల్లేశ్వరి సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యం కోసమే ఆల్బెండజోల్ మాత్రలు

అమరచింత: 19 ఏళ్ల వయస్సుగల వారందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలని దీంతో రక్త హీనత తగ్గి ఆరోగ్యంగా ఉండొచ్చని డీఎంఆర్‌ఎం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మానస తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న వారికి సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు నిఖిత, రూపశ్రీల తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

వనపర్తి రూరల్: పెబ్బేరు కస్తూర్బా పాఠశాలల్లో సోమవారం జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి డాక్టర్ పరిమళ విద్యార్థులకు డాల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ పద్మ, వైద్య అధికారి ప్రవళిక, సుధారాణి, వ్యాక్సిన్ అధికారి పరుశురామ్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, కస్తూర్బా అల్బెండజోల్ నివారణ మాత్రలను ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు, కేజీబీవీ ఎస్‌ఓ హేమాలత తదితరులు పాల్గొన్నారు.


అమరచింతలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

వీపనగండ్ల: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో సోమవారం చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ.. అందరూ సహకరించాలని కోరారు. పుల్గర్‌చర్లలో రాజశేఖర్‌తో కలిసి పాఠశాల విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు.


పెబ్బేరులోని కస్తూర్బా పాఠశాలలో..


పాన్‌గల్ కస్తూర్బాలో..


పుల్గర్‌చర్లలో